

పెద్దింటి విజయలక్ష్మి

తల వంచుకుని గిన్నెలు కడుగుతూంది రాములు. ఆమె మస్తిష్కంలో మెదలుతున్న ఆ జ్ఞాపకాలు ఆమె మనసుకు భారాన్నందజేస్తున్నాయి. కడుపులో పేగులు తిరిగినట్లు, అస్తవ్యస్తమైన బాధ. కన్నీళ్ళు కాలువలు కట్టలేదు గానీ, తలచి తలచి వచ్చే దుఃఖం అప్పుడప్పుడు గొంతుకని పూడ్చేస్తూంది. అలా జరగటం తన విధి. ఈ పనులు చేయటం తన విధిగా రోజులు అలవాటు ప్రకారం గడచి పోతున్నాయి.

'రాములూ, నేటికి మూడోనాడు పండగ. నువ్వు గదులు కడిగితే, రంగవల్లులలంకరించాలి' అంటూ వంటింట్లోంచి తొంగి చూసింది యజమానురాలు రాజేశ్వరమ్మ!

ఆ 'పండగ' మాట విన్న రాములు మనసు కుంగిపోయింది. దీపావళి పండగ కొందరికి సరదాని, సంతోషాన్ని కలిగించినా, రాములికి గడచిన విషయాల భయోత్పాతాన్నీ, మనోభావాన్నీ పెంచసాగింది. ఆ మాట చెవిన పడనిచోటి కెక్కడికైనా పారిపోదామా' అని అనిపిస్తుంది. కానీ యిప్పుడు తన కర్తవ్యయాల్లో మార్మోగుతూంది అదే ఐపోయింది. ఏమీ పట్టనట్టు, తన దుఃఖాన్ని తానే అనుభవిస్తూ కదలకుండా ఓ చోట కూర్చుందామన్నా, యితరుల సంతోషాన్ని పంచుకునే స్థితి ఎదురౌతూంది. కడుపు చేతబట్టుకుని, పరుల యింట్లో చాకిరీ చేసే తన లాంటి పేద తల్లికి, ఏ రోజు తను కోరినట్టు గడుస్తుందని!! యజమానులు చెప్పినట్టు చేయకపోతే, పనిలో నుంచి తీసేస్తారు. అప్పుడు....అప్పుడు....తను పస్తులు పడుకున్నా తనకు ఫరవాలేదు. కానీ, పసివాళ్ళైన కన్నబిడ్డల్ని పస్తుంచాలంటే? రాములు మనసు విలవిల్లాడిపోతూంది. అందుకే యీ నాటకమంతా! అందుకే తను దుఃఖాననుభవిస్తున్నా, వాళ్ళ సంతోషమే తన సంతోషంగా భావించి, వాళ్ళు చెప్పినట్టు చేసి, వాళ్ళని మెప్పించాలి. అందుకే రాములు, 'మధ్యాహ్నం కడిగేస్తానమ్మగారూ' అని జవాబిచ్చింది ఎలాగో గొంతు పెగల్చుకుని.

సంతోషంగా వంటింట్లోకి వెళ్ళిపోయింది రాజేశ్వరి.

మధ్యాహ్నం అంట్లు గిన్నెల పని ముగించుకుని, గదులు కడిగే పనికుపక్రమించింది రాములు.

వంటింట్లో నుంచి సుగంధ ద్రవ్యాల సువాసనలు ఆ యిల్లంతా చుట్టేసింది. పండక్కి పిండివంటలు చేస్తూంది రాజేశ్వరి. 'రాములూ, నేను దగ్గరలేనని అట్లాగ్గా కడిగి రాకు. గదులు శుభ్రంగా కడగాలి సుమా' అని అరిచింది వంటింటి నుంచే.

రాజేశ్వరికి పండగ సరదా గంట గంటకీ ఎక్కువైపోతూంది. కానీ....రాములికి? తప్పదు మరి!

రెండు బాల్చీల నిండా నీళ్ళు తోడుకుంది. రెండు చేతుల్తో రెంటినీ ఒక్కసారే మోస్తూ, గదిలోకి తీసుకొచ్చింది. ఒక్కొక్క గదినీ సబ్బు వేసి, చీపురుతో రాచిరాచి కడగసాగింది. ఎన్ని బక్కెట్లు నీళ్ళు మోసిందో ఎన్ని నీళ్ళు పారబోసిందో ఎంత సమయం గడిచిందో-ఒళ్ళు తెలియని దానిలా, గుండె నీరై, కడుగుతున్న నీటితో కొట్టుకు పోయినట్టు, ఒళ్ళు విరుచుకుని, తన యజమానికి అమితానందం కలిగేట్టు చేసి పారేసింది. ఇంటికొచ్చిన తర్వాతగానీ ఆ ఒంటి తీపులు తెలియలేదు. రెండు చేతులూ కొట్టివేయబడ్డాయా అన్నట్టు నడుం రెండు ముక్కలైందా అన్నట్టు – ఏదో బాధ!

'అమ్మా ఆకలి' అంటూ పిల్లలు దగ్గర చేరారు. జుట్టు రేగి, ఒళ్ళు, బట్టలు మట్టిగొట్టుకుని వున్నారు వాళ్ళు. అలా వాళ్ళని చూడగానే రాములు కడుపు కదిలింది. తను నొప్పుల్ని కాసేపు మరవక తప్పదని మళ్ళా లేచింది. పిల్లలకు స్నానం చేయించి, తల దువ్వింది. తనూ ఒళ్ళు కడుక్కుంది. గబగబ పొయ్యి రాజేసి అన్నం వండింది. రాజేశ్వరమ్మ వద్దని పడేసిన పచ్చడి తాను తెచ్చుకుంది. దాంతో ఆరోజు పిల్లలకు అన్నం పెట్టింది. భర్తకూ అంతే. ఏమిటో తనూ తిందామని కంచంలో అన్నం పెట్టుకుంది గానీ, అన్నం సయించినట్టు లేదు. తినాలని లేదు. మళ్ళా అన్నం గిన్నెలో పెట్టి మూసేసింది. గుక్కెడు నీళ్ళు తాగి యివతలకి వచ్చేసింది. అప్పుడే రాములికి కొద్దిగా తీరిక. తీరిక చిక్కగానే, ఆమె మనసు 'సూరిడూ. ఎక్కడున్నావురా?' అని మూలుగుతుంది. బయటికి తెలియని గుండెబాధాగ్నికి కరిగి నీరైపోతే, రహస్యంగా ఆమె కన్నులు కన్నీరు కారుస్తూనే వుంటాయి. కడుపులో పేగులు పట్టి పీకేస్తూంటాయి. నిస్సహాయురాలై, అలా అలమటించి పోతుంది రాములు.

తెల్లవారితే మళ్ళా మొదలు! చాకిరీతో ఆమె గుండెను తాత్కాలికంగా బందబార్చుకుంటుంది. ఏడాది కాలంగా ఆ మనిషి అలా మారిపోయింది. అందునా యీ దీపావళి పండగ దగ్గరౌతున్న

# తల్లిమనసు



కొద్దీ-ఏదో తెలియని తపన, ఆవేశం. సరిగ్గా, క్రిందటేడు. యిదే దీపావళి పండగ తనకు అంధకారాన్ని మిగిల్చిపోయింది. పండగ పది రోజుల ముందునుంచే పిల్లలు టపాకాయలు పేలవటం మొదలు పెడతారు. టపాకాయల ప్రేలుడు ధ్వనికి వాళ్ళెంత ఎగిరి గంతులేస్తారో, ఆ సంతోషమే మిటో గానీ, రాములికి మాత్రం తన గుండె పేలినట్టే వుంటుంది. 'ఈ పండగ అయ్యేవరకూ అరిచేతుల్లో ప్రాణాలు పెట్టుకుని గడిపే తనలాంటి పూరిగుడిసెలో కాపురాలు చేసే నిరుపేదలకు, ఏ అపాయమూ కలగకపోతే, పెద్ద గండం గడిచి బయట పడ్డట్టే' – అని తలపోసే రాముల్ని యీ పండగ–గండంలోనే ముంచి వెళ్ళిపోయింది. ఇప్పుడు మళ్ళా వచ్చింది. రాములికి మళ్ళా అదే భయం!

'రాములూ! కడిగిన గదుల్లో పిండి ముగ్గులు పెట్టి, రంగుల్తో అలంకరించాను చూశావా?' — తను చేసిన పనికి పనిమనిషి దగ్గర కూడా మెప్పు పొందాలనే ఆరాటం కాబోలు రాజేశ్వరమ్మలో– అలా అడిగింది!

రాముల్ని చూడకుండా మాట్లాడ్డమేకానీ, చూస్తే ఆ ముఖ కవళిక అర్థం గ్రహింపుకు రాకుండా పోతుందా? సుఖ సంతోషాలతో మునిగి తేలేవారు– కష్టాలనేవి కూడా వున్నాయి, వాటిని మన ఎదురుగుండానే ఎవళ్ళో ఒకళ్లు అనుభవిస్తుంటారనే నిజాన్ని గ్రహించరు. అది వాళ్ళ గ్రహింపుకు అంత సులభంగా రాదు. కానీ, దుఃఖాన్ననుభవించే వారు, ఎదుటివారి సంతోషాన్ని అంత త్వరగా కూలదోయలేరు!

గదుల్లోకెళ్ళి, రాజేశ్వరమ్మ పెట్టిన ముగ్గుల్ని చూసొచ్చింది రాములు. 'చాలా బాగున్నా యండమ్మగారూ' అంది–ఆవిడ ప్రీత్యర్థం!

రాములి ప్రశంసకు రాజేశ్వరి పొంగి యింతలావైంది! రాములికి త్వరగా తన పిల్లల దగ్గరికెళ్ళి వాళ్ళెలావున్నారో చూడాలని మనసు ఆరాటపడుతూంది.

'ఇక వెళ్తానమ్మా' అంది.

'ఆగు రాములూ. పిల్లలకు తలంటు స్నానం చేయించేస్తే, రేపటికి కొంత తేలిగ్గా వుంటుంది. ఆ గిన్నెలో కుంకుడుకాయలు పెట్టాను. కొట్టి నానబెట్టు, అని పని పురమాయించింది.

మనసు తమాయించుకోక తప్ప లేదు రాములికి. 'అమ్మగారికి తెలుసు నాకు పిల్లలున్నారని. ఇక్కడి

కొచ్చి చాల సమయం గడిచిందనీ తెలుసు. కానీ, వాళ్ళు వున్నవాళ్ళు!' అని తలచి తలవంచింది.

కుంకుడుకాయలు కొట్టి, నానబెట్టే సరికి, 'రాములు, కాఫీ తీసుకో' అంటూ పొగలు గ్రక్కే నల్లటి ద్రవ పదార్థం తన ముందు పెట్టింది యజమానురాలు.

తాగాలనిపించ లేదు రాములికి. కానీ, నిరాకరిస్తే కారణమడుగుతుంది అమ్మగారు. తనేమని చెప్పగలదు? ఎలా చెప్పగలదు? ఆ వుద్వేగం రాగానే, జ్ఞానేంద్రియాలు వాటి పని మానేసి, సమ్మెట పోటు ననుభవిస్తున్నట్లైనాయి రాములికి. 'తాగకపోతే అమ్మగారే మనుకుంటారో' అన్నట్టుగా గ్లాసందుకుని కాఫీ తాగేసింది.

రాజేశ్వరమ్మగారి ముగ్గురు పిల్లలకూ తల రుద్ది, బైట పడేసరికి, మరో గంట గడిచింది.

ఇంటికి బయలుదేరబోయింది రాములు.

'రాములూ, యివి మా వాళ్ళకి చిన్నవైనాయి. నీ పిల్లలకు తొడుగు' అంటూ, వాళ్ళ పిల్లల బట్టలు కొన్ని తీసుకొచ్చి రాములికిచ్చింది రాజేశ్వరి.

అనుకోని యీ క్రియకు రాములికి వెంటనే ఏ భావమూ కలగలేదు. చేతిలో వున్న బట్టల పైన దృష్టి నిలిపింది. లాగు చొక్కా! మగ పిల్లల బట్టలు కంటికి కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి!

రాములు కడుపు దేవినట్లైంది. గుండె ఉబికి రాబోయే దుఃఖాన్ని బలవంతాన ఆపుజేసుకుంది. ఎందుకో—ఆ బట్టలు తీసికెళ్ళ బుద్ధవలేదు. 'అమ్మగారూ. ఒద్దండి' అని, వెనక్కి యిచ్చేయనూ లేకపోయింది. చివరికి, మర్చిపోయిన దానిలా, వాటిని గోడ చివర గూట్లో పెట్టి, వెళ్ళిపోయింది.

ఇంటికెళ్ళగానే దుఃఖం కట్టలు తెంచుకుంది.

'ఏందే రాములూ యిది. అయిందైపోయింది. ఇలా తలచి తలచి యేడిస్తే ఆడు లేచి వత్తాడా చెప్పు!'—ఓదార్చాలని అన్నాడు దాని మొగుడు సత్తిగాడు.

'నీకు తెలవదు మావా. ఆడదాన్ని, తల్లిని. నా బాధ నీకు తెలవదు' అంటూ, తనివితీరా యేడ్చేసింది రాములు. అప్పటికి గానీ ఆమె మనోభారం తగ్గలేదు. వర్షించిన మేఘం మాయమైనట్టు అప్పటికి కొంత వుపశమనం కలిగింది. ఏదో కర్తవ్యం స్ఫురించిన దానిలా చటుక్కున లేచి వంట చేసింది. సత్తిగాడికి, పిల్లలకు పెట్టింది. తాను తినలేదు. తినమని సత్తిగాడు నాల్గు సార్లు చెప్పాడు గానీ, లాభం లేక యిక వూరుకున్నాడు. కొంత సమయం మౌనంగా గడిపేసింది రాములు. సత్తిగాడు చుట్ట కాల్చుకుంటూ వీధరుగు మీద కూర్చున్నాడు, పిల్లలు నిద్రపోయారు. సత్తిగాడు చుట్టనుంచి వచ్చే పొగలు, రాములికి ఏవేవో ఆలోచనలు రేకెత్తించ సాగాయి.

ఈ మాటు యీ పండగ గడిచి, వున్న తమ నల్గురూ బతికి బట్ట కడితే అంతే చాలునన్నట్టుగా తోచింది రాములికి. ఉండుండి వినబడే టపాకాయల మోతలు తననింకా భయపెట్టేస్తున్నాయి. మెల్లిగా లేచి, సత్తిగాడి దగ్గరకు వచ్చింది.

'మావా, రేపు నువ్వింటికాడుంటావా?' ప్రాధేయపూర్వకంగా అడిగింది మొగుణ్ణి.

'ఎందుకూ?' అని అడిగాడు సత్తిగాడు తుపుక్కున వుమ్మేస్తూ.

'మరిళ్ళ దగ్గర ఎవ్వరూ లేకపోతే....' మాట పూర్తి చేయలేకపోయింది రాములు.

సత్తిగాడికి పెళ్లాం మనసు యిప్పుడర్థమైంది. అయినా, 'రోజూ నువ్వు పన్లోకి, నేను బండికి ఎల్తే, అల్లుంటం లేదే? అట్టాగే రేపు కూడా' అన్నాడు.

రాములికి దుఃఖం, కోపం మిళితమై వచ్చింది. 'ఇన్నాళ్ల మాట వేరు. రేపు మాట వేరు. ఓపాలి దెబ్బ తిన్న తర్వాత, మల్లా పిల్లల్నలా దిక్కులేని వాల్లని చేసి, ఎవరి దిక్కాల్లెల్లకూడదు. పిల్లలకాడ వుంటే నువ్వుండాల, లేదా నేనుండాల' అంది స్థిర నిశ్చయంగా.

'నువ్వే వుండు' అనేసి, చుట్ట నోట్లో పెట్టుకున్నాడు సత్తిగాడు. తన మాట యింత నిర్లక్ష్యంగా తీసేస్తాడని ఎదురు చూడని రాములు, అతని వాలకానికి గుడ్లెర్రజేసింది.

'మగాడనిపించుకున్నావులే' అని, లోపలికొచ్చేసింది. వచ్చి, నిద్రపోతున్న తన బిడ్డల దగ్గర చోటు చేసుకుని తానూ పడుకుంది. 'ఉండకపోతే పోనీ! అదీకేంటి మగాడు. తల్లికున్నట్టు పిల్లల మీద 'ఔమ' మగాల్లకుండదు. నా పిల్లల దగ్గర నేనే వుంటాను. ఆల్లకేమీ జరక్కుండా నేనే ఆల్లని కాపాడుకుంటాను. ఆ ఒక్క రోజూ గడిస్తే, యీ పండగెల్లిపోతాది. ఆ తర్వాత యింక యేడాదిదాక భయం లేదు'—తనలో తాను నిశ్చయించుకుంది రాములు.

'అమ్మగారూ' అని సంశయిస్తూ నిలుచుంది రాములు.

'ఏంటే ఆ నీల్గు. ఏం కావాలో చెప్పు' యజమానురాలు రాజేశ్వరి అసహనం చూపింది.

'రేపు నేను రానండి' అంది, కళ్ళల్లో దైన్యం చోటు చేసుకోగా, రాములు.

తారాజువ్వలా లేచింది రాజేశ్వరి.

'అదేమిటే, రేపేకదూ అసలు పండగ. రానంటావేమిటి? ఇంట్లో ఎంత పని వుంటుంది? నేనొక్కదాన్ని ఎలా చేసుకుంటా ననుకున్నావు? మీకింతేనే, ఎంత చేసినా మీ బుద్ధులు మీకు పోవు. తీరా, సమయం చూసి యిలా ముంచుతారు. అదేం కుదరదుగానీ, రేపు మాత్రం నువ్వు రావాల్సిందే.'

రాములు మొహంలో కళ తప్పింది. కదిపితే ప్రవహిస్తాయా అన్నట్టు, దుఃఖావేశం దాని కనురెప్పల్ని బరువుచేసింది.

'అది కాదండమ్మా....' ఏదో చెప్పబోయింది.

'ఏది కాదు? నువ్వు రేపు నాగా పెట్టడానికి వీల్లేదు. పైగా, రేపు భోజనానికి చుట్టాలొస్తున్నారు కూడా. ఇంట్లో పనీ, బయటి పనీ....నేనొక్కదాన్నీ చేసుకోగలనా? రేపు నువ్వు రావాల్సిందే. లేకుంటే....'

పూర్తికాని ఆ మాట భావం గ్రహించిన రాములు, ఒక్కసారి రాజేశ్వరి కళ్ళల్లో కళ్ళు పెట్టి చూసింది. ఏదైతే కానీ, తన నిశ్చయం తనదేనని తీర్మానం చేసుకుంది. ఏం మాట్లాడకుండా, తల వంచుకుని, అక్కడ్నుంచి కదిలింది.

లోపలకు వెళ్ళబోయిన రాజేశ్వరి, ఏదో గుర్తొచ్చినదానిలా, 'రాములూ' అని పిలిచింది.

రాములు ఆగింది.

'నిన్న నీ పిల్లలకు, పండగపూట తొడుక్కుంటారుకదాని బట్టలిస్తే, ఆ గూట్లో పెట్టి వెళ్లావ్. మర్చిపోయావేమో, తీసుకెళ్ళు' అంది.

రాములు రెండు నిముషాలు తటపటాయించింది. చివరికి, 'వద్దండి' అంది అనలేక, అనలేక.

రాజేశ్వరికి నెత్తురున కోపం వచ్చింది మళ్ళా, అవమానం పొందినట్టు భావించింది.

'మీకేం లేకపోయినా, పొగరు మాత్రం పుట్టెడుందే. రేపు మానేయటానికి వీల్లేదన్నానని. నన్నిలా సాధిస్తావా? నీకిష్టముంటే రా, లేకుంటే పూర్తిగా మానెయ్. పనివాళ్ళకి వూరేం కొల్లపోలేదు. నీ బెదిరింపులు నా దగ్గరకాదు. తెలుసుకో' అతి కఠినంగా పలికింది రాజేశ్వరి.

ఒకే పండగ యిద్దరు వ్యక్తుల్లో రెండు రకాలైన భావోద్వేగాన్ని కలిగించింది।

రాజేశ్వరి వేసిన ఆ నిందని, ఆ దూషణను తట్టుకోలేకపోయింది సున్నితమైన రాములు మనసు.

'అమ్మగారూ, నన్నంతలేసి మాటలనకండి. అసలే మనసు పుండుపడి వున్నదాన్ని. నా బాధ మీకర్థం కాదు. మిమ్మల్నవమానపరచాలని కాదు. మీకా సంగతి తెలియదు. అందుకే........అందుకే మీరలా మాట్లాడారు. మీ అబ్బాయిగారి లాగూ, సొక్కా చూడగానే....నాకు....నా బాబు గురించి దుఃఖం వచ్చిందమ్మా.'

ఉన్నట్టుండి రాములు అలా యేడ్చేసరికి, ఏమీ అర్థం కాలేదు రాజేశ్వరికి.

'ఏమిటే రాములూ? ఏమైంది నీ కొడుక్కి?' ఉన్నట్టుండి వచ్చిన ఆదుర్దానంతా కంఠంలో నింపుకుని అడిగింది రాజేశ్వరి.

రాములు గుండె పగిలింది.

'నా కొడుక్కేమైందా? ఏమైందమ్మగారూ? ఆడు సచ్చిపోయినాడు. సచ్చి సుక్కైపోయినాడు. ఈ తల్లినిలా యేడుస్తుందమని, యీ దీపావళి పండగిచ్చిన కానుకమ్మా నాకు.'

విలపించే తల్లి హృదయానికి రాజేశ్వరి గుండె కరిగింది. 'రాములూ, అసలేం జరిగింది?' వినబోయే సంగతి 'విధివిలాస'మని అర్థమైన రాజేశ్వరి కంఠం జీరగా మారింది. రాములు చెప్పటం మొదలుపెట్టింది.

'నిరుడు, యీ పండగనాడే, నేనూ, మా యాయన పిల్లల్నింటికాడ వదిలి, ఎవరి పనుల్లోకి వాల్లెల్లిపోయాము. నా బాబే నాకు తొలి సంతానం. ఆడు పుట్టేటప్పుడే దొరబాబల్లే తెల్లగా బొద్దుగా పుట్టాడు.

'రాములూ, ఆ సూరీడల్లే మెరిసిపోతుండాదే మన బాబు' అంటూ, మా యాయన పిల్లగాణ్ణి సూసి మురిసిపోయాడు.

'అయితే మావాఁ, యీణ్ణి, 'సూరే' డనే పిల్చుకుందామన్నాను. 'అలాగేలేవే. ఆడు పెరుగుతుంటె మా ఆసలన్నీ అడిమీదనే పెట్టుకుని సూసుకునే వాల్లం. అడికి చక్కగా సదూ చెప్పించి వుద్యోగం వేయించాలని అనుకున్నాము. అడికి తెలివితేటలు కూడా మెండుగ వుండేవమ్మా, మాలాంటిల్లల్లో పుట్టాల్సినాడు కాదు నాసూరేడు. ఆదేముడు పొరపాటుగా పుట్టించేసినాడు. మద్దిలో గురుతొచ్చి, తీసికెల్లిపోయినాడు. ఎటుమంటోడైనా, అణ్ణి పదినెలలు మోసి కన్నాను. నా రకతం పంచి యిచ్చాను. నేనాడి తల్లిని. నా తల్లిగుండె వూరుకోలేపోతున్నదమ్మా. ఆడున్నప్పటికన్నా ఎక్కువగా సచ్చిపోయిన తర్వాత నా కళ్ళల్లో మెదులుతున్నాడు. మర్చిపోటానికి, నా మతన్నా చలించింది కాదు. అంతా జరిగి ఒక్క సంవచ్ఛరమైంది. క్రిందటేడు యిలాగే మీలాంటమ్మగారు, 'యిదుగోనే రాములూ నీ కొడుక్కి లాగు చొక్కా అడిగావు, పట్టుకెల్లు' అని ఆడికి బట్టలు, మందుసామాన్లు, మిఠాయిండిలు పెట్టింది. ఆనందంగా పట్టుకెల్లి నా బిడ్డకిచ్చుకున్నా. కానీ. యియ్యాల ఆడులేడు. నా సూరేడు నాకు లోకాన్ని సీకటి సేసి ఎల్లిపోయినాడు. పదేల్లకే అడికి నూరేల్లూ నిండినాయి. అందుకనే, మీరిచ్చిన బట్టలు నేనెలా పట్టుకెల్లనమ్మా? నా మనసు నిలవ లేదు. అటి నక్కడే పెట్టి యెల్లాను. కళ్లొత్తుకుంటూ ఒక్క నిముషం ఆగింది రాములు.

'ఎందుకలా ప్రవర్తించానా?' అని పశ్చాత్తాపపడ సాగింది రాజేశ్వరి మనసు.

'యింటికాడ పిల్లలు ముగ్గురే వున్నారు. ఆడపిల్లలిద్దరూ యింటి బయట ఆడుకుంటున్నారు. నా బాబు బుద్ధిమంతుడు. ఆల్ల బాబు ఒకటో కలాసు పుత్తకం కొనిత్తే, సదూకుంటూ యింట్లోనే కూచున్నాడట, ఇంతలో ఎక్కడినుంచి వచ్చిందో, ఆ యముడే యేశాడో, తారాజువ్వ యింట్లోకి దూసుకొచ్చిందిట. రావటం రావటం, యీడిమీదే వచ్చి పడిందిట. ఆడి పక్కనే గూట్లో, ఆ యమ్మ యిచ్చిన పటాసులున్నాయి. నిప్పురవ్వ పడి, అయి కూడా అంటుకుని కాలినాయిట. ఆ మంట గుడిసె కెగసి, గుడిసెకు అగ్గి పట్టింది. ఆడు బెదిరిపోయి అలా నిలుసుండి సూసేలోపు, పైకప్పు మీద పెద్ద

[లోకజ్ఞానం – సమాధానాలు]

1. మాస్కోకి దక్షిణంగా వున్న లెనిన్ హిల్స్ మీద వున్న ఎమ్. వి. లొమొనొసోవ్ స్టేట్ యూనివర్శిటీ. 787.4 అడుగుల ఎత్తు, 32 అంతస్తులు, 40 వేల గదులు గల ఈ విశ్వవిద్యాలయం 1949–58 మధ్య నిర్మించబడింది.
2. ఇతర దేశాలలో వలె కాకుండా మలేసియాలో అక్కడి రాజుని, ఆ దేశంలోని తొమ్మిది సంస్థానాల రాజులు కలిసి, రహస్య ఎన్నికల పద్ధతిపై తమలో ఒకరిని రాజుగా ఎన్నుకుంటారు. అతడు ఐదు సంవత్సరాలపాటు ఆ పదవిలో వుంటాడు. రాజు ఎన్నిక కాబడడం వల్ల అక్కడ పట్టాభిషేకం అనేది వుండదు. పదవీ స్వీకారం మాత్రమే ఈ ఎన్నికైన రాజుకి కూడా వర్తిస్తుంది. అలా గత సంవత్సరం ఎన్నికైన రాజు సుల్తాన్ అబుబకర్.
3. 1955లో హిందూ వివాహాల చట్టం క్రింద.
4. మేరీ యూజినియా ఛార్లెస్. ఈమె నాయకత్వం వహించిన డొమినికా ఫ్రీడమ్ పార్టీకి జూలై, 1980న జరిగిన ఎన్నికలలో మెజారిటీ లభించడంతో డొమినిషియా దీవికి ప్రధాన మంత్రి అయ్యింది.
5. స్ట్రాటజిక్ ఆర్మ్స్ లిమిటేషన్ టాక్స్. [అగ్రరాజ్యాల మధ్య అణ్వాయుధాల తయారీపై జరిగిన ఒడంబడిక]
6. అమెరికాకు చెందిన సాండీ అలెన్. జూలై 14, '77న ఆమె 22వ ఏట 7 అడుగుల 7¼" అంగుళాల ఎత్తు వున్న సాండీ తను యింకా పొడవు పెరగకుండా పిట్యూటరీ గ్రంథికి సంబంధించిన శస్త్ర చికిత్స చేయించుకున్నది.
7. రాబర్ట్ హ్యూస్ (అమెరికా). రాబర్ట్ తన ఆరవ ఏటనే 203 పౌండ్లు బరువు వున్నాడు. ఆరడుగుల పైబడి ఎత్తు వున్న అతడు తన 32వ ఏట 1,069 పౌండ్లు బరువు తూగాడు. ఆ సంవత్సరమే మరణించిన రాబర్ట్‌ని ఒక పెద్ద పియానో పెట్టె అంతటి శవ పేటిక (బరువు 1,100 పౌండ్లు)లో పెట్టి ఒక క్రేన్ సహాయంతో అంత్యక్రియలు జరిపించారు.
8. ది రిపబ్లిక్.
9. నటాలియా ప్రొఖానోవా (రష్యా). మే 22, 1965న ఈమె ఇ – 32 జెట్ విమానంలో 79,842 అడుగుల ఎత్తువరకు విమానం నడిపి రికార్డు సృష్టించింది.
10. ఫిబ్రవరి 14, '75న సియోల్ (దక్షిణ కొరియా) నగరంలో జరిగిన సామూహిక వివాహాలలో 1,800 మంది దంపతులకు వివాహం జరిగింది.

పెద్ద మంటల్నిండుకున్నాయిట. పక్క గుడిసెలకు కూడా అగ్గి పాకింది. ఆ మంటలనుంచి ఆడు బయటికి రాలేకపోయినాడమ్మా. నా సూరేడు ఆ మంటలకు భయపడి, మూర్ఛపోయినాడు. ఆడింట్లోనే వున్నాడని ఎవరూ తెలుసుకోలేక పోయినారు. ఎవరి ఆదుర్దా వాళ్ళదై పోయింది. నేనింటికెల్లి సూసే సరికి, యింత ఘోరం జరిగిపోయింది. నా యిద్దరు బిడ్డలూ భయంగా నన్ను సుట్టేసుకున్నారు.

'అమ్మా, అన్న....అన్న' అంటూ పెద్దపిల్ల ఏడిసింది గుడిసెను చూపుతూ.

హడలిపోయి, యింటి దగ్గరికి పరుగెత్తుకెళ్ళి చూసాను. యింకేం మిగిలింది? ఆణ్ణలా చూసే సరికి, నా పై ప్రాణాలు పైనే పోయినాయి. ఎంత యేడ్సినానో....నా సూరీడు మల్లా వుదయించనేదమ్మా. నా కెప్పుడూ చీకటే. ఈ దీపావళి అమవాస చీకటే నాకు దక్కింది. ఇదేనమ్మగారూ నా కొడుకు కథ'

రాములు కన్నీటి కథ విన్న రాజేశ్వరి మనసు వికలమైపోయింది.

'ఊర్కో రాములూ. ఏడవకు. ఏనాడు ఏ పాపం చేశావో, దేవుడు నీకిలాంటి శిక్ష వేశాడు' అంది. ఆమె కళ్ళల్లో కూడా లీలగా కన్నీళ్ళు కదలాడాయి.

'పాపమే చేశానమ్మా. ఆనాడు అనుమంటి కొడుకుని పోగొట్టుకున్న నేను, అప్పుడే సచ్చిపోయుండేదాన్ని. కానీ, మిగిలిన యిద్దరు పిల్లలకీ నేను తల్లిని. పసి వాళ్ళు జరిగిన యీ ఘోరాన్ని చూసే బెదిరిపోయారు. నన్ను కర్సుకుపోయారు. ఏదన్నా సేస్తే ఆల్ల కన్నాయం సేసిన దాన్నౌవుతాను. గుండె పట్టుకుని బతికానమ్మా. కొన్నాళ్ళు మనసు బాగోక ఎక్కడికీ యెల్లనేదు. మా యాయన తెచ్చేది సాలక, తిండికి కష్టమై పోతుంటే, మల్లా మీ యింటిలో పనికి చేరాను.'

కంటితో చూడ్డమే కాకుండా, మనసర్పించి కదలాడే ఆ తల్లి హృదయాన్ని చూసిన రాజేశ్వరికి యిప్పుడర్థమైంది, ఆ తల్లి ఆరాటమేమిటో.

రాములు అక్కడ్నుంచి లేచి, చెంబుతో నీళ్ళు తీసుకుని మొహం కడుక్కుంది. అసలు సంగతి మర్చిపోయి, ఏదో ధ్యాసలో వున్నదానిలా, 'వెళ్తానమ్మా' అని ముందరకు నడిచింది.

రాజేశ్వరి అక్కడ్నుంచి కదల్లేక పోయింది. తన మనసులో మాట రాములికి చెప్తేగానీ ఆమెకు మనసు నిలిచేలా లేదు.

'రాములూ' అని, వెళిపోతున్న రాముల్ని వెనక్కు పిలిచింది.

రాములొచ్చింది.

'చూడు రాములూ. నువ్వు రేపు రానవసరం లేదు. నేనే ఎలాగో చేసుకుంటాను. నీ బిడ్డల్ని జాగ్రత్తగా చూసుకో నువ్వు' అని పలికింది.

తృప్తిగా రాజేశ్వరిని చూసింది రాములు.

'మీ లాంటి తల్లులున్నంత వరకూ, నాలాటోళ్ళకేం ఫరవాలేదమ్మా' అన్నట్టున్నాయి ఆ చూపులు.

'అలాగే నమ్మా' అని వెళుతున్న రాముల్ని చూస్తూ నిలుచున్న రాజేశ్వరి మనసు, 'పాపం' అని పశ్చాత్తాప పడింది. □

# చిట్టికథ

## బొమ్మ



సాయింకాలం ఆఫీస్‌నించి తిరిగొస్తున్నాను. నాలుగురోడ్ల కూడలిలో ఓ బిచ్చగాడిలాంటి మనిషి ఏదో బొమ్మ గీస్తూ కనిపించాడు— మసిబొగ్గుతో. కొన్నిరంగుల సుద్దలు కూడా దగ్గర పెట్టుకున్నాడు. కాసేపట్లోనే అతని బొమ్మరూపు సంతరించుకుంది. దారిన పోతున్న జనం ఓ క్షణం ఆగి, చూసి వెళ్తున్నారు. ఆ బొమ్మ హిందువుల ఆరాధ్య దైవం – ఏడుకొండలవాడు. చెయ్యితిరిగిన చిత్రకారుడి బొమ్మలా మెరిసిపోతోంది – బిచ్చగాడు వేసిన కలర్సుకి. బొమ్మ పూర్తిచేసి, ప్రక్కనే భక్తిగా నమస్కరిస్తూ కూచున్నాడు బిచ్చగాడు.

పోగుపడ్డ జనం భక్తితోనో, ఆ భిక్షకుడి ఆర్టుకి సంతోషంతోనో, అయిదు, పదిపైసలు తీసి బొమ్మ మీదికి విసిరి పోతున్నారు. కాసేపట్లోనే బొమ్మ ఆకారం కూడా కనిపించనంత మందంగా డబ్బులు పేరుకుపోయాయి. నేనంతా గమనిస్తూనే వున్నాను. కొద్దినిమిషాల్లోనే దాదాపు వంద రూపాయలవరకు సంపాదించాడు.

ఆ తర్వాత మరో వారం రోజులకే ఓ ఆదివారం సాయంత్రం స్నేహితురాలిని కలుద్దామని జగన్నాధపురం వెళ్ళాను. చర్చి స్క్వేర్ దగ్గర చాలా మంది జనం గుమిగూడి వుంటే, ఏమిటోనని అటుపోయి చూశాను. అక్కడ జీసస్ క్రైస్తు బొమ్మ; బొమ్మచుట్టూ రంగు రంగుల కొవ్వొత్తులు వెలుగుతున్నాయి. కిందుగా 'కరుణామయుడు' అని అందమైన అక్షరాలు. పక్కనే, మెడలో శిలువబొమ్మ ధరించిన బిచ్చగాడిలాంటి వ్యక్తి మోకాళ్ళమీద కూచుని రెండు చేతులూ చాచి ఆకాశం వంక చూస్తూ ప్రార్థనలో లీనమయి వున్నాడు. అతనే ఆ బొమ్మ గీసినవాడయి వుంటాడని గ్రహించాను. ఏసుక్రీస్తు బొమ్మనిండా ఖాళీ లేకుండా పావలాలు అర్ధరూపాయలు, రూపాయినోట్లు! భక్తులు తమ ప్రభువుపేర ఆ చిత్రకారుడికి సమర్పించుకుంటున్న కానుకలు అవి! ఆ చిత్రకారుడి ముఖంలోకి పరీక్షగా చూసి, తృళ్ళిపడ్డాను. అతనెవరో కాదు—వారంరోజుల క్రితం నాలుగు రోడ్ల కూడలిలో వేంకటేశ్వరస్వామి బొమ్మ గీచినవ్యక్తే! అప్పుడు హిందువుల ఆరాధ్య దైవాన్ని సజీవంగా చిత్రించి పూజిస్తూ కనిపించినవాడే, యీరోజు ఏసుప్రభువుని చిత్రించి రెట్టింపు భక్తిశ్రద్ధలతో ప్రార్ధన చేస్తున్నాడు.

నాకో చిన్న సందేహం వచ్చింది. ఇంతకీ అతను హిందువా, క్రైస్తవుడా – తెలుసుకోవాలనిపించింది.

జనం పూర్తిగా వెళ్ళిపోయాక ఆ భిక్షకుణ్ణి సమీపించి నా అనుమానం వెల్లడించాను.

ఆ భిక్షగాడు నా వంక బెదురుతూ చూసి చుట్టూ యింకా మిగిలిన జనం వింటారేమోననే భయంతో, నోటితో ఏం చెప్పకుండా, తన కుడిచేయి నా ముందుకి చాపాడు నాకు మాత్రమే కనిపించేలాగ. అతని ముంజేతిమీద— "అబ్దుల్ కరీం" అన్న పచ్చబొట్టు కొట్టొచ్చినట్టు కనిపించింది నాకు!

—బొమ్మిడి రాజేశ్వరి